క్లుప్తంగా

రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం వెనుక నిర్మించిన రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ నాయకులు రోడ్డును పరిశీలించారు. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈరన్న, వెంకటేశ్వర్లు, నాగశేషుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మానవపాడు: కార్మికుల హక్కుల కోసం పోరాడిన నజీర్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నజీర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజు, నఫీ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



ఎర్రవల్లి: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన మల్లేష్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ఏపీజీవీబీ, సాసనూలు బ్రాంచ్‌లో రూ.436 తో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం చేయడంతో బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కును బుధవారం మేనేజర్ రాఘవేంద్రారెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ బ్యాంకులో బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, ఎస్ఎస్టీసీఎఫ్ఎల్ కౌన్సిలర్లు మధు, కృష్ణ, రవిసాగర్, గ్రామస్తులు, ఉన్నారు.

అర్ధరాత్రి పోలీసుల గస్తీ



అయిజ: మండల కేంద్రంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాలు, పాఠశాలల్లో చోరీకి పాల్పడుతుండడంతో బుధవారం తెల్లవారుజామున ఎస్ఐ విజయభాస్కర్ తిక్క వీరేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా వివిధ వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో నిద్రిస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిరునామాను నిర్ధారించే ఆధార్ కార్డులను వెంట ఉంచుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమిషనర్‌కు సన్మానం

శాంతినగర్: వడ్డేపల్లి నూతన కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన రాజయ్యను కౌన్సిలర్లు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, వైస్ చైర్‌పర్సన్ సుజాత, కౌన్సిలర్లు దేవమ్మ, కోఆప్షన్ సభ్యులు మొహినుద్దీన్, నాయకులు దేవేంద్ర, జయశ్రీ, లక్ష్మి, తోటమాధవరావు, జగన్, నవాజ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎర్రవల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ బుధవారం తెలిపారు. మండలంలోని బీచుపల్లి నుంచి ఎర్రవల్లి మండల కేంద్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీ చేశారు. ఇసుక తరలింపునకు సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించి యజమాని ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి నుంచి గద్వాల జిల్లా కేంద్రానికి పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని జరిమానా నిమిత్తం మైనింగ్‌శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ధరూరు: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. వివరాలు.. ఆత్మకూరు మండలంలోని మస్తీపురం నుంచి గద్వాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా జూరాల డ్యాం జీరో పాయింట్ వద్ద బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. టాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుకూర్ తెలిపారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

- గట్టులో ప్రజావేదికలో అడిషనల్ కలెక్టర్
- ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



గట్టులో నిర్వహించిన ప్రజావేదికలో ఆడిట్ వివరాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిని గుర్తించి, ఆర్ఆర్ యాక్టు ద్వారా దుర్వినియోగమైన నిధులను రాబట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్, డీఆర్‌డీఏ నర్సింగరావు హెచ్చరించారు. బుధవారం గట్టు మండల పరిషత్ కార్యాలయం వద్ద 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 27 గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులకు ఆడిట్ నిర్వహించారు. ఏడాది కాలంలో 339 పనులకు గాను రూ.2,67,04,547 ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కూలీలకు రూ.2.50కోట్లు చెల్లించగా, రూ.17.03లక్షలు మెటీరియల్‌కు చెల్లించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 57 పనులకు గాను మొత్తం రూ.2కోట్లు మంజూరు కాగా.. ఇందులో రూ.24,437 కూలీలకు చెల్లించగా, రూ.1,83,33,737 మెటీరియల్‌కు చెల్లించారు. ఈ పనులకు సంబంధించి ఆడిట్ బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటించి, పనులను పరిశీలించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

ఆడిట్ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ ఉపాధి నిధుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను గ్రామాల్లో చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు. మొక్కలు, పండ్ల తోటల పెంపకం, కూలీలకు ఉపాధి కల్పన, నీటి నిల్వ కుంటల పనులను సక్రమంగా చేయడంతో పాటు వాటిని అందరూ వినియోగించుకునేలా చూడాలన్నారు. జాబ్ కార్డులు ఒకరివి అయితే పని చేసే వారు మరోకరు ఉంటున్నారని, గ్రామాల వారిగా ఆడిట్ బృందం తెలిపారు. హరితహారం ద్వారా నాటిన మొక్కలు కేవలం 60 శాతం వరకు మాత్రమే ఉన్నాయని, చెల్లింపులు మాత్రం 100 శాతం చేసినట్లు ఆడిట్ బృందం బయట పెట్టింది. నిబంధనలకు విరుద్ధంగా నర్సరీ నిర్వాహకులకు పంచాయతీ ఖాతా నుంచి కాకుండా ఒకే వ్యక్తి నుంచి 8 పంచాయతీల నర్సరీలకు చెల్లింపులు చేసినట్లు ఆడిట్ గుర్తించింది. మాచర్లలో చెన్నయ్య అనే వ్యక్తి కర్ర సహాయంతో కూడా నడవలేని స్థితిలో ఉండగా, రోజు కూలీ పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి, డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఆడిట్ సభ్యులు గుర్తించారు. నర్సమ్మ అనే మహిళ నర్సరీ పనులకు వెళ్లకుండానే ఆమె పేరున రూ.13,750లు డ్రా చేసుకున్నట్లు ఆడిట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోలర్ అశోక్, అంబుడ్స్‌మెన్ జమ్మన్న, ఎస్ఆర్‌పీ బాలునాయక్, ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓలు స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



చేప పిల్లలు వదులుతున్న సుదర్శన్‌రెడ్డి

ధరూరు: మత్స్యకారుల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని వర్గాల వారిని ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల ఫేజ్–2 ర్యాలంపాడు రిజర్వాయర్‌లో మత్స్య శాఖ అధికారులతో కలిసి 8.68లక్షల చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులు అంతరించిపోకుండా అన్ని వృత్తుల వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈఈ వెంకట్రామిరెడ్డి, జేఈ గణేష్, మాజీ సర్పంచు తిమ్మప్ప, మత్స్య సహకార సంఘం నాయకులు నర్సింహులు, గోవిందు, చిన్న నర్సింహులు గౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల శ్రమదానం



అయిజ: మండలంలోని బుర్ర బండ పంట పొలాలకు సంబంధించిన రైతులు బుధవారం కాల్వలో మొలిచిన పిచ్చి మొక్కలు, బురదను తొలగించి ఆదర్శంగా నిలిచారు. గతంలో ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన కాల్వ జమ్ముతో పాటు వివిధ రకాల మొక్కలతో నిండిపోయింది. దీంతో నీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. రైతులు శ్రమదానం చేసి కాల్వలో ఉన్న మొక్కలు, పూడికను తొలగించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మాట్లాడుతూ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా వెళ్లేలా చేశామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 13 మంది విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అండర్–14, అండర్–19 క్రీడల్లో ప్రతిభ కనబరిచి 13 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని బుధవారం ప్రిన్సిపల్ దేవానందం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు కల్వకుర్తిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అండర్–14లో సాయిప్రియ, సమంత, అనుష, కబడ్డీలో కళావతి, సానియా, కె.భారతి, పీఎస్ భారతి, అండర్–19 ఖోఖో లో ఎం.మమత, గాయత్రి, వాణి, కృష్ణవేణి, అండర్–19 అథ్లెటిక్స్ విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో గాయత్రి, స్రవంతి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. హెచ్‌ఎంతో పాటు పీడీ రాధ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ఓటీపీ రాక సిలిండర్ అందజేతలో జాప్యం



శాంతినగర్: గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు ఓటీపీ రావడం లేదంటూ సిలిండర్ ఇవ్వడం లేదని జూలెకల్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక గ్యాస్‌కు సంబంధించిన సబ్సిడీ డబ్బులు సైతం ఖాతాల్లో పడటం లేదని వాపోతున్నారు. ఈవిషయమై అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

బ్లాస్టింగ్ బాధితులకు పరిహారం చెల్లించాలి



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

గట్టు: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌లో దెబ్బతిన్న ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జోకన్‌గట్టు, సల్కాపురం గ్రామాల్లో బ్లాస్టింగ్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లను ప్రజా సంఘాల నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ నర్సింహ మాట్లాడుతూ రాయాపురం శివారులోని సర్వే నెంబర్ 199లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన బ్లాస్టింగ్‌లో వేరే రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందినట్లు తెలిపారు. క్వారీ అనుమతులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వామి, శాంతన్న, రెడ్డప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి



మానవపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ వాహిదా ఖాతూన్



అలంపూర్‌లో..



అయిజలోమాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటయ్య

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు పకడ్బందీగా పూర్తిచేయాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ, శిక్షణ పొందిన అధికారులు ఎన్యుమరేట్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీఓ వెంకటయ్య మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఇళ్ల జాబితాను తయారు చేయాలని సూచించారు. 6 నుంచి 18వ తేదీ వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ జనార్దన్, ఐకేపీ ఏపీఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేనేజర్ అశోక్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఎన్యుమరేటర్లకు ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించన శిక్షణ ఇచ్చారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

రాజోళి: సమగ్ర కుటుంబ సర్వేను గ్రామాల్లో పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సర్వే చేసే విధానాలపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు ఇతర సర్వే బృందాలతో సమావేశం నిర్వహించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ వాహిదాఖాతూన్ ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. వివరాలు పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలని, సర్వేలోని ప్రశ్నలు, సమాధానాల గురించి వివరించారు. 150మందికి ఒక ఎన్యుమరేటర్ ఉండేవిధంగా మ్యాప్‌లను తయారు చేయాలని సూచించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తిరుపతన్న ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ హరికృష్ణ, ఏపీఓ సౌజన్య, ఏపీఎమ్ కోటేశ్వరి పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో శిక్షణ తీసుకున్న ముగ్గురు ట్రెయినీలు వీరికి శిక్షణ అందించారు. సందర్భంగా ఎంపీడీఓ పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 47 మంది ఎన్యుమరేటర్లు, ఐదుగురు సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఏపీఓ రాజు, ఏపీఎం, ఎంఏఓ నాగర్జున్‌రెడ్డి, ఉపాధ్యాయుడు వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: కులగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సాహేదాబేగం, ఎంపీడీఓ కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్, ఏపీఎం గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ప్లాట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అలంపూర్: వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు ఓపెన్ ప్లాట్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని వారాహి హోటల్‌లో బుధవారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2009లో కృష్ణ, తుంగభద్రలకు భారీ వరదలు రావడంతో అలంపూర్ ముంపునకు గురి కాగా.. వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పటికీ కోలుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం పునరావాసం కల్పిస్తామని భరోసా ఇచ్చినా బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే వరద బాధితులతో కలిసి అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ, రాష్ట్ర ఓబీసీ ప్రోగ్రాం కోకన్వీనర్ నాగమల్లయ్య, బీజేపీ నాయకులు రాజగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రంగస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మధురవాణి తదితరులు ఉన్నారు.

నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి



గద్వాలలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల అర్బన్: మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలికను పనిలో పెట్టుకోవడమే కాక.. దొంగతనం కేసు మోపి బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం శోచనీయమని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు చట్టానికి విరుద్ధంగా మైనర్ బాలికకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురి చేయడంతో భయాందోళనకు గురై బాలిక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ కేసులో అనేక అనుమానాలు ఉన్నాయని, సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బాలిక మృతిపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ డీకే అరుణ, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. బాలిక మృతిపై ఢిల్లీలోని చైల్డ్ ప్రొటెక్షన్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలో రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, బాలిక మృతదేహానికి రీ పోస్టుమార్టం చేసి వాస్తవాలను తేల్చాలని కోరారు. సమావేశంలో నాయకులు బుచ్చిబాబు, లవన్న, రంగస్వామి, ప్రేమ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

శాంతినగర్: మైనర్ బాలిక మరణానికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో శాంతినగర్‌లో బుధవారం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక మరణానికి కారణమైన రాజశేఖర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో కొంకల భీమన్న మాదిగ, మస్తాన్‌మాదిగ, రాజశేఖర్, దేవరాజు పాల్గొన్నారు.

కేసీఆర్ సంస్కరణలతోనే రాష్ట్రానికి వెలుగులు



పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంస్కరణలతోనే రాష్ట్రానికి వెలుగులు వచ్చాయని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పోరాటం వలన రాష్ట్ర ప్రజలకు రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ముప్పు తప్పిందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, శివకుమార్, మద్దిలేటి, వీరేష్, కృష్ణ, మహేష్‌గౌడ్, రాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపాల్‌నాయక్

మల్దకల్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ గోపాల్‌నాయక్, ఎంఈఓ సురేష్ సూచించారు. బుధవారం మల్దకల్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవాల బారిన పడి విద్యార్థులు తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని కోరారు. బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి ఖాతాల వివరాలు అడగరని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి ఓటీపీ, ఇతర వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ



బుడమొర్సులో ఆవుదూడకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మల్దకల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్, ఉష సూచించారు. బుధవారం మండలంలోని అడవిరావల్‌చెర్వు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. గ్రామంలో మొత్తం 438 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామంలో 31 మంది రైతులకు సంబంధించి 132 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యులు తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో టీకాలు వేస్తామని, రైతులు పశువులను సిద్ధంగా ఉంచాలని పశువైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ పుష్పలత, వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, వెంకటమ్మ, కృష్ణ, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై నిర్లక్ష్యం తగదు



రాజోళి: వ్యాధి నిరోధక టీకాలపై నిర్లక్ష్యం చేయకూడదని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మూడో సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వ్యాధి నిరోధక టీకాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, మద్దమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల హక్కులను కాపాడుతాం

ధరూరు: తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శిగా ధరూరు మండలంలోని నెట్టెంపాడుకు చెందిన ధర్మకారి గోపాల్‌జీ ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు నియామక పత్రం అందజేశారు.

‘ఆధార్’ సమస్యలు పరిష్కరించండి

శాంతినగర్: విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నమోదు సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ శాంతిరాజు, చాంద్‌బాషా అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎస్ఎస్ఆర్ ఆధార్ ఏజెన్సీ ఆపరేటర్ల జిల్లా స్థాయి సమీక్ష బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతు పాఠశాల విద్యార్థులకు సంబంధించిన ఆధార్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆపరేటర్లకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విద్యార్థుల కొత్త నమోదులు పరిశీలించారు. ఎంఈఓ నరసింహ మాట్లాడుతు విద్యార్థుల నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

రైతు భరోసా నిధులు మంజూరు చేయాలి

ఎర్రవల్లి: ప్రభుత్వం రైతు భరోసా నిధులను మంజూరు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని శివనంపల్లిని సందర్శించి రైతులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు ముందే అన్నదాతలకు రైతు భరోసా నిధులను జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ జమ చేయలేదని మండిపడ్డారు.